
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత ఆదివారం గరిష్ఠం : 31.0 కనిష్ఠం : 24.0
ANDHRAJYOTHY



సోమవారం 26 మే 2025



గాయిత్రి కాలనీ వద్ద కనిపించిన చిరుత

వామ్మో.. చిరుత..

అగళి, మే 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాయిత్రి కాలనీ గ్రామ సమీపాన ఆదివారం తెల్లవారుజామున పొలాల్లోకి వెళ్తున్న రైతులకు చిరుత కనిపించింది. చిరుతను పలువురు గ్రామస్థులు మొబైల్‌లో బంధించారు. కేకలు వేస్తూ పరిసర ప్రాంతాల్లోని వారిని అప్రమత్తం చేశారు. చిరుత ఆహారం కోసం గ్రామ పరిసరాల్లోకి వచ్చి ఉంటుందని స్థానికులు అభిప్రాయపడ్డారు. అటవీ అధికారులు.. చిరుతను బంధించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నేడు ప్రజాఫిర్యాదుల
పరిష్కార వేదిక

పుట్టపర్తిటౌన్, మే25(ఆంధ్రజ్యోతి): స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. కలెక్టరేట్‌తోపాటు మండల, డివిజన్ స్థాయిలో కార్యక్రమం నిర్వహిస్తారన్నారు.

పర్తీశా వందనం..

పుట్టపర్తి, మే 25(ఆంధ్రజ్యోతి): బాలవికాస్ చిన్నారులు సత్యసాయి ప్రేమతత్వంపై పర్తీశా వందనం అంటూ ఆలపించిన గీతాలు భక్తిపారవశ్యంలో ముంచాయి. ఒడిశా బాలవికాస్ చిన్నారులు రెండో రోజు ఆదివారం సాయికుల్వంత్ సభామంటపంలో భక్తిగీతాలను ఆలపించారు. గంటపాటు భక్తులను మైమరపింపజేశారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

పాటలు పాడుతున్న బాలవికాస్ చిన్నారులు



మహాసేవకులు.. గ్రామీణ తపాలా ఉద్యోగులు

- మీ సమస్యలను పార్లమెంటులో ప్రస్తావిస్తా
- ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

7



ప్రభుత్వ కార్యాలయాల్లో జగన్ ఫొటో ఉంటే
రోడ్డుపై పడేయండి



- పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పిలుపు
- ఉనికి కోసమే వైసీపీ నేతల వెంపర్లాట అంటూ ధ్వజం

7

ఇరువర్గాల ఘర్షణ

- కొడవళ్లు, రాడ్లు, కట్టెలతో పరస్పర దాడులు
- ఎనిమిదిమందికి గాయాలు
- ధర్మవరం మండలం ఏలుకుంట్లలో ఘటన

7

రోడ్డు ప్రమాదాల్లో
ముగ్గురు మృతి

బైక్ అదుపు తప్పి ఇద్దరు.. ట్రాక్టర్ కింద పడి ఒకరు..

7

హిందూపురం పట్టణ వ్యూ..









ఆశలకు రెక్కలు..!

జిల్లాకు మరో భారీ పరిశ్రమ?

- లేపాక్షి, మడకశిర మధ్య ఏర్పాటుకు సన్నాహాలు
- రక్షణరంగ, ఎలక్ట్రానిక్ పరికరాల తయారీకి అనుకూలం
- కలిసొచ్చిన విమానాశ్రయాలు, జాతీయ రహదారులు
- సీఎం ప్రకటనతో జిల్లా ప్రజల హర్షం

కొత్త ప్రభుత్వం కొలువుదీరాక పారిశ్రామిక ప్రగతి ఊపందుకుంది. జిల్లాప్రజల పారిశ్రామిక ఆశలు నెరవేరే పరిస్థితులు కనిపిస్తున్నాయి. భారీ పరిశ్రమ ఏర్పాటయ్యే అవకాశాలున్నాయి. ఇప్పటికే జిల్లాలో అంతర్జాతీయ స్థాయి కియ కార్ల పరిశ్రమ ఉంది. మరో భారీ పరిశ్రమ జిల్లాకు రానున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించడంతో జిల్లాప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో అత్యంత వెనుకబడిన మడకశిర, హిందూపురం ప్రాంతంలో సైనిక, పౌర విమానాలు, రక్షణరంగ ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ, ఏరోస్పేస్ ఎకో సిస్టం పరిశ్రమ ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. జిల్లాను పారిశ్రామికహబ్‌గా మారుస్తామని ఉద్ఘాటించారు. ఇక్కడ పరిశ్రమల స్థాపనకు ప్రముఖ సంస్థలు ముందుకొస్తున్నాయి. జిల్లాకు భారీ ప్రాజెక్టు తీసుకొచ్చేలా ప్రభుత్వం కృషిచేస్తోంది. భవిష్యత్తులో పారిశ్రామికవాడ గేమ్‌చేంజర్ అవుతుందని భావిస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, హిందూపురం



పక్క రాష్ట్రం నుంచి తెచ్చే ప్రయత్నాలు

పక్కనున్న కర్ణాటక నుంచి హిందుస్తాన్ ఏరో నాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) అడ్వాన్స్‌డ్ మీడియం కంపాక్ట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎంసీఏ), లైట్ కంపాక్ట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఎల్‌సీఏ) ఉత్పత్తిని ఏపీకి తరలించాలని ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి గంటల వ్యవధిలో లేపాక్షికి చేరుకోవచ్చు. లేపాక్షి, మడకశిర హబ్‌లో హెచ్ఏఎల్‌కు సంబంధించి ఏఎంసీ ఉత్పత్తి కోసం 10వేల ఎకరాల భూమిని సీఎం ప్రతిపాదించారు. ఈ ప్రాజెక్టుల విలువ వేల కోట్ల రూపాయలు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. పాలసముద్రంలోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్‌ను వేగంగా పూర్తి చేయాలని కేంద్రాన్ని కోరారు. బెంగళూరు, హైదరాబాద్ కారిడార్‌లో లేపాక్షి, ఓర్వకల్లు మధ్య ఎలక్ట్రానిక్ సిటీ రాబోతుందని చెప్పడంతో మరిన్ని పరిశ్రమలు వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఎలక్ట్రానిక్ సిటీ నిర్మాణంలో యాపిల్‌తోపాటు ఇతర ప్రపంచస్థాయి సంస్థలు భాగస్వామ్యం అవుతాయని సీఎం పేర్కొనడంతో పరిశ్రమలకు అనుకూలంగా ఉందని సంబంధింత మంత్రులకు నివేదించారు.

ఇప్పటికే కియ



శ్రీసత్యసాయి జిల్లాలో ఇప్పటికే ప్రపంచ ప్రసిద్ధిగాంచిన కార్ల పరిశ్రమ కియ ఉంది. పాలసముద్రం వద్ద నాసెన్‌తో పాటు మరో రెండు పరిశ్రమలు ఏర్పాటు కాబోతున్నాయి. కియ అనుబంధ పరిశ్రమలున్నాయి. ఎన్టీఆర్ హయాంలోనే తూమకుంట, గోళ్లాపురం పారిశ్రామికవాడల్లో వందకుపైగా పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. స్టీల్, ఫార్మా పరిశ్రమలున్నాయి. వీటితోపాటు సీఎం చెప్పినట్లు మరో భారీ పరిశ్రమ జిల్లాకు వస్తే నిరుద్యోగ సమస్య తగ్గుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. జిల్లాలో చదువుకున్న యువత అత్యధికంగా బెంగళూరు, హైదరాబాద్, చెన్నై నగరాలకు వెళ్లి ఉద్యోగాలు చేస్తున్నారు. మరికొంత మంది చదువుకుని ఉద్యోగాలు రాక ఖాళీగా ఉంటున్నారు. ఈ పరిస్థితుల్లో జిల్లాకు భారీ పరిశ్రమలు వస్తే యువతకు పుష్కలంగా ఉద్యోగావకాశాలుంటాయని భావిస్తున్నారు.

కలిసొచ్చిన విమానాశ్రయాలు

హిందూపురం, మడకశిర నియోజకవర్గాలు దేవనహళ్లి అంతర్జాతీయ విమానాశ్రయానికి వంద కిలోమీటర్లలోపే ఉన్నాయి. జాతీయ రహదారులు అనుసంధానంగా ఉన్నాయి. రోడ్డుమార్గాన విమానాశ్రయం నుంచి ఈ నియోజకవర్గాలకు గంటలో చేరుకోవచ్చు. జిల్లా కేంద్రమైన పుట్టపర్తికి కూడా ఈ రెండు నియోజకవర్గాలు 70కి.మీ. దూరంలోనే ఉన్నాయి. ఇక్కడ కూడా విమానాశ్రయం ఉంది. దీంతో విమానాశ్రయాలు.. పరిశ్రమలు పెట్టేవారికి అనుకూలంగా ఉన్నాయి. హిందూపురం, పెనుకొండ, నియోజకవర్గాల పరిధిలో జాతీయ రహదారుల విస్తరణతోపాటు నూతనంగా రాష్ట్ర రాజధాని నుంచి చిలమత్తూరు మండలం కనిశెట్టిపల్లి వరకు గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు వేగంగా సాగుతున్నాయి. కదిరి, పులివెందుల మీదుగా ఆరులైన్ల రోడ్డుతోపాటు హిందూపురం నుంచి కదిరికి నాలుగు వరుసల రోడ్డు పనులు ప్రారంభం కానున్నాయి. దీంతో ఇప్పటికే కొడికొండ చెక్‌పోస్టు నుంచి మడకశిర మీదుగా బెంగళూరు-పుణ హైవేకి 544ఈ జాతీయ రహదారి ఏర్పాటైంది. దీంతో హిందూపురం ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటుచేస్తే రవాణాకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. రైలు మార్గం కూడా ఉంది. పరిశ్రమలు పెట్టడానికి అన్నివిధాలా అనుకూలమైన ప్రాంతంగా చెప్పవచ్చు.



దేవనహళ్లి అంతర్జాతీయ విమానాశ్రయం



వేగంగా భూసేకరణ

జిల్లాలో పరిశ్రమల స్థాపనకు 35వేల ఎకరాల భూములు సేకరించాలనీ, ఆ ప్రక్రియ వేగవంతం చేయాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదివారం ఆదేశించారు. ఆర్డీఓ, ఏపీఐఐసీ జెడ్ఎంతో సమీక్ష జరిపారు. జిల్లాలో భూసేకరణ పనులు వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో ఐదు బ్లాక్‌లు గుర్తించాలన్నారు. మండలాల్లోని ప్రభుత్వ భూములను ఏపీఐఐసీకి అప్పగించాలన్నారు. ఐదు పారిశ్రామిక నగరాలు అభివృద్ధి చెందుతాయన్నారు. లేపాక్షి, గోరంట్ల, మడకశిర, పెనుకొండ కియ, పుట్టపర్తిని పారిశ్రామిక నగరాలుగా అభివృద్ధి చేయనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. రామగిరి, కనగానపల్లి మండలాల్లో సోలార్ పార్కుల ఏర్పాటుకు భూమిని గుర్తించి, నివేదికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

గుంతల రోడ్డులో భయం.. భయం..

కత్తేకొట్టాలకు మట్టి రోడ్డే గతి..!

గుంతలతో ప్రయాణం.. నరకప్రాయం

ధర్మవరంరూరల్, మే 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కత్తేకొట్టాల గ్రామానికి వెళ్లాలంటే సాహసాలే చేయాలి. మట్టి రోడ్డు, అది కూడా అడుగడుగునా మోకాలి లోతు గుంతలు పడ్డాయి. ఆ రోడ్డులో వాహనదారులు భయంభయంగా వెళ్తున్నారు. కత్తేకొట్టాలకు మోటుమర్ల మీదుగా వెళ్లాలి. ధర్మవరానికి వెళ్లే రహదారి క్రాస్ నుంచి మోటుమర్ల మీదుగా కిలోమీటర్ మేర మట్టిరోడ్డే దిక్కు. గుంతలమయమవడంతోపాటు రోడ్డుకు ఆనుకుని కంపచెట్లు పెరగడంతో ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం వస్తే గుంతల్లోకి నీరు చేరి, ప్రయాణించలేని దుస్థితి ఏర్పడుతోందంటున్నారు. అధికారులు, పాలకులు స్పందించి రోడ్డు వేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అధ్వానంగా కత్తేకొట్టాల రోడ్డు



కీలక హత్యా కేసు ఛేదింపు

న్యాయవాది కేసీ కృష్ణారెడ్డి లొంగుబాటు

హిందూపురం, మే 25(ఆంధ్రజ్యోతి): ఎన్ఎస్‌యూఐ నేత, యువ న్యాయవాది సంపత్‌కుమార్ హత్యకేసులో ప్రధాన నిందితుడుగా పోలీసులు భావించిన కేసీ కృష్ణారెడ్డి లొంగిపోయినట్లు డీఎస్పీ మహేష్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. కేసు వివరాలిలా ఉన్నాయి. హిందూపురానికి చెందిన న్యాయవాది కేసీ కృష్ణారెడ్డి ఇంటి వద్ద స్థలం విషయంలో మేళాపురం వాసి శ్రీకాంత్‌తో గొడవలు ఉండేవి. ఆబాద్‌పేటలో నివాసముంటున్న సంపత్‌కుమార్, శ్రీకాంత్ స్నేహితులు. శ్రీకాంత్‌కు సంపత్‌కుమార్ అండగా ఉన్నాడని వాగ్వాదాలు కూడా జరిగాయి. దీంతో అప్పట్లో కేసీ కృష్ణారెడ్డి, సంపత్‌కుమార్ పరస్పరం కేసులు కూడా పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో సంపత్‌కుమార్‌పై కుట్రపన్నారు. గతేడాది మే 29న రాత్రి 10.30 ప్రాంతంలో హిందూపురం మండలం కొటిపి సమీపంలోని చింతలపల్లికి వెళ్లేదారిలో పక్కకు తీసుకెళ్లి మద్యం తాపించి కొడవలి, బాకుతో దాడి చేశారు. పగిలిన బీరుబాటిల్ సీసాలతో పొడిచి హత్యచేశారు. మృతదేహాన్ని కారు డిక్కీలో వేసుకుని వెళ్లి ధర్మవరం సమీపంలోని చెరువు మరువవద్ద పడేసి పోయారు. దీనిపై దర్యాప్తుచేపట్టి తొమ్మిది మందిపై కేసు నమోదుచేశారు. ఇందులో ఐదుగురిని అప్పట్లోనే అరెస్టు చేశారు. ఏ-2గా ఉన్న న్యాయవాది కేసీ నాగార్జునరెడ్డిని కర్ణాటకలో అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో పోలీసులు కీలక నిందితునిగా భావిస్తున్న ఏ-1 కేసీ కృష్ణారెడ్డి ఆదివారం డీఎస్పీ మహేష్ వద్ద లొంగిపోయారు. నేరాన్ని అంగీకరించడంతో కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసులో నిందితులు హైకోర్టు, సుప్రీంకోర్టులో ముందస్తు బెయిల్ పిటీషన్ వేశారనీ, అయినా ఎస్పీ రత్న చొరవ తీసుకుని, కౌంటర్ ఫైల్ దాఖలు చేయించి, అడ్డుకున్నారని డీఎస్పీ తెలిపారు. ఈ నేపథ్యంలో ఏడాదిగా అజ్ఞాతంలో ఉన్న ప్రధాన నిందితుడిని కోర్టులో హాజరు పరిచామని డీఎస్పీ వివరించారు.

చేనుకు పండుగ



కొత్తచెరువు మండలం తలమర్ల వద్ద విత్తనం వేస్తున్న రైతు

కొత్తచెరువు, మే 25(ఆంధ్రజ్యోతి): రుతుపవనాల ముందస్తు ఆగమనం అన్నదాతల్లో ఆశలు రేపింది. ఈనెల 24వ తేదీనే ఈ ఏడాది ముందస్తుగా నైరుతి రుతుపవనాలు కేరళను తాకాయి. దీంతో అన్నదాతలకు విత్తుకు ఉపక్రమించారు. ఇటీవల కురిసిన వర్షాలకు చేలను దుక్కి చేసుకున్నారు. ప్రస్తుతం విత్తు పనుల్లో నిమగ్నమయ్యారు. రైతు.. గొర్రుతో విత్తనం వేస్తుంటే.. పలువురు సహాయక పనులు చేస్తుంటే.. చేనుకు పండుగ వచ్చినట్లుంది. పొలాలు పులకించిపోతున్నాయి.

ప్రశాంతంగా యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్షలు

కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా పరిశీలకుడు, అనంతపురం కలెక్టర్

(7వ పేజీలో..)

మహానాడుకు తరలిరండి

టీడీపీ జిల్లా అధ్యక్షుడు వడ్డే అంజినప్ప



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు వడ్డే అంజినప్ప

పుట్టపర్తిరూరల్, మే 25(ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రతిష్ఠాత్మకంగా కడపలో నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమానికి జిల్లాలోని ప్రతి కార్యకర్త, నాయకుడు తరలిరావాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు వడ్డే అంజినప్ప పిలుపునిచ్చారు. పుట్టపర్తిలోని తెలుగుదేశంపార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన ఆదివారం సాయంత్రం మాట్లాడుతూ.. ఈనెల 27, 28, 29, తేదీల్లో కడపలో మహానాడు పండుగలా నిర్వహిస్తారన్నారు. జిల్లా నుంచి పెద్దఎత్తున హాజరుకావాలని కోరారు. సమావేశంలో జిల్లాకార్యదర్శి సామకోటి ఆదినారాయణ, కప్పలబండ మాజీ సర్పంచ్ చంద్రశేఖర్, గంధమనేని వెంకటరాముడు, బీసీ శంకరప్ప, వెంకట్రామయ్య, యువ నాయకుడు సత్తి, గూడూరు విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

విత్తన వేరుశనగ సబ్సిడీ ధరలు ఖరారు

అనంతపురం అర్బన్, మే 25 (ఆంధ్రజ్యోతి): విత్తన వేరుశనగ సబ్సిడీ ధరను ప్రభుత్వం ఖరారు చేసింది. ఈ ఏడాది కే-6, టీసీజీఎస్ 1694, కదిరి లేపాక్షి రకం వేరుశనగకు 40 శాతం సబ్సిడీని వర్తింపజేశారు. కే-6 రకం వేరుశనగ క్వింటాల్ పూర్తి ధర రూ.9300లుగా నిర్ణయించారు. ఇందులో 40 శాతం సబ్సిడీ మొత్తం రూ.3720పోను రైతు వాటా కింద రూ.5580 చెల్లించాలి. టీసీజీఎస్ 1694 రకం వేరుశనగ క్వింటాల్ పూర్తి ధర రూ.9300లుగా నిర్ణయించారు. ఇందులో 40 శాతం సబ్సిడీ మొత్తం రూ.3720పోను రైతు వాటా రూ.5580లు చెల్లించాలి. కదిరి లేపాక్షి రకం వేరుశనగ క్వింటాల్ పూర్తి ధర రూ.8200లుగా నిర్ణయించారు. ఇందులో సబ్సిడీ మొత్తం రూ.3280లుపోను రైతు వాటా రూ.4920లు చెల్లించాలి. అర ఎకరా వరకు (30 కేజీ వేరుశనగ బ్యాగ్) ఒక బ్యాగ్, అరఎకరా నుంచి ఎకరా వరకు 2 బ్యాగ్‌లు, ఒక ఎకరా నుంచి ఆపైన ఎకరాలున్న రైతులకు 3 బస్తాలు పంపిణీ చేస్తామని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో చిన్నారి మృతి

పెనుకొండ రూరల్, మే 25(ఆంధ్రజ్యోతి): వాటర్ హీటర్‌ను తాకి చిన్నారి మృతి చెందిన సంఘటన పెనుకొండ సమీపంలోని రబ్బర్ ఫ్యాక్టరీ క్వార్టర్స్‌లో ఆదివారం జరిగింది. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన మేరకు తమిళనాడు రాష్ట్రం సేలం జిల్లా ఆతూరు తాలూకా మళ్లియాకరై గ్రామానికి చెందిన అశోక్ తన భార్య పిల్లలతో పెనుకొండ సమీపంలోని ఈశ్వర్ రబ్బర్ ఫ్యాక్టలో పనిచేస్తూ అక్కడే క్వార్టర్స్‌లో నివాసముంటున్నాడు. ఈక్రమంలో ఆదివారం స్నానానికి వేడినీటి కోసం హీటర్‌ను ఉంచారు. అయితే అశోక్ పెద్దకుమార్తె సెల్వ మౌళిక(7) ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు దాన్ని తాకింది. షాక్‌కు గురైన చిన్నారిని గమనించిన తల్లి గాయిత్రి, భర్త ఇతర శ్రామికులు హుటాహుటిన పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. గాయిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

11కేవీ వైర్లు తగిలి బాలుడు...

రాప్తాడు: మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీ కళాకారుల కాలనీలో సాకే మల్లికార్జున కుమారుడు సాకే జయకృష్ణ (13) ఆదివారం సాయంత్రం విద్యుదాఘాతంలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కళాకారుల కాలనీలో నివాసం ఉంటున్న పెయింటర్ సాకే మల్లికార్జున కుమారుడు సాకే జయకృష్ణ ఆదివారం సాయంత్రం గాలిపటం కోసం ఇంటిపైకి వెళ్లాడు. ప్రమాదవశాత్తు సమీపంలో ఉన్న 11కేవీ విద్యుత్‌లైన్లు బాలుడికి తగిలి మంటలు వ్యాపించాయి. దీంతో బాలుడు సాకే జయకృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు కట్టెల ద్వారా జయక్రిష్ణను విద్యుత్ తీగల నుంచి తప్పించారు. వెంటనే అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో కటుంబ సభ్యులు, బంధువులు బోరున విలపించారు.

క్రికెట్ జట్టు ఎంపికకు తీవ్రపోటీ

అనంతపురం క్లాక్‌టవర్, మే 25 (ఆంధ్రజ్యోతి): అండర్-19 జిల్లా సీనియర్ జట్టు ఎంపికకు తీవ్ర పోటీ నెలకొంది. జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అనంతపూర్ స్పోర్ట్స్ అకాడమీ స్టేడియంలో జిల్లా అండర్-19 పురుషుల క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఇందుకు 155మంది క్రీడాకారులు హాజరయ్యారు. సెలెక్షన్ కమిటీ సభ్యులు షాషావలీ, డేవిడ్‌రాజ్, సుధీర్‌రెడ్డి, సర్దార్, రాఘవేంద్రలు క్రీడాకారుల ఫిట్‌నెస్, బౌలింగ్, ఫీల్డింగ్, బ్యాటింగ్‌లను పరిశీలించారు. తుది జట్టును త్వరలో ప్రకటించనున్నారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సౌత్‌జోన్ మేనేజర్ సాగర్‌చౌదరి, జిల్లా క్రికెట్ సంఘం జిల్లా కార్యదర్శి భీమలింగారెడ్డి, సహాయ కార్యదర్శి మురళీకృష్ణ సీనియర్ ప్లేయర్లు పాల్గొన్నారు.

బెట్టింగ్‌రాయుళ్ల అరెస్టు



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

రొళ్ల, మే 25(ఆంధ్రజ్యోతి): క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు మడకశిర రూరల్ సీఐ రాజ్‌కుమార్ ఆదివారం తెలిపారు. మండలంలోని కె. బ్యాడిగెర గ్రామ చెరువు కట్ట శివారులో చింతచెట్టు కింద బెట్టింగ్ ఆడుతున్నారన్న సమాచారం వచ్చింది. సీఐ, ఎస్ఐ వీరాంజనేయులు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఆరుగురిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.1.02లక్షలు, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ప్రశాంతంగా యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్షలు

కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా పరిశీలకుడు, కలెక్టర్



జేఎన్‌టీయూలో పరీక్షలను తనిఖీ చేస్తున్న కలెక్టర్

అనంతపురం టౌన్, మే25, (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఏడు పరీక్షా కేంద్రాలలో ఈ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 2546మంది అభ్యర్థులు ఈపరీక్షలకు హాజరుకావాల్సిఉంది. ఉదయం జరిగిన పేపర్-1 పరీక్షకు1522మంది హాజరయ్యారు. 1024మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 1515మంది హాజరు కాగా మిగిలినవారు గైర్హాజరైనట్లు కలెక్టరు వినోద్‌కుమార్ తెలిపారు. జిల్లా పరిశీలకుడిగా వచ్చిన ఐఏఎస్ అధికారి ఎంఎంనాయక్, జాయింట్‌కలెక్టరు శివనారాయణశర్మతో కలిసి కేఎస్ఎన్‌మహిళా డిగ్రీకళాశాల, ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీకళాశాల, ప్రభుత్వ డిగ్రీ ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఎంతమంది పరీక్షలు రాయాల్సి ఉంది? ఎంత మంది పరీక్షకు హాజరయ్యారు? వంటి వాటి గురించి సిబ్బందితో ఆరా తీశారు. పరీక్ష గదులలోకి వెళ్లి పరీక్షల నిర్వహణ, వసతులు పరిశీలించారు. జిల్లా కలెక్టరు వినోద్‌కుమార్ జేఎన్‌టీయూ కాలేజ్‌లో జరుగుతున్న పరీక్షలను పరిశీలించారు. అక్కడ భద్రతా చర్యలను ఆయన ఆరాతీశారు.

మహాసేవకులు.. గ్రామీణ తపాలా ఉద్యోగులు

మీ సమస్యలను పార్లమెంటులో ప్రస్తావిస్తా

ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం సెంట్రల్, మే 25(ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటికి పోస్టల్ సర్వీసెస్‌ను తీసుకెళ్లే మహాసేవకులు గ్రామీణ తపాల ఉద్యోగులని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఆర్ట్స్ కళాశాలలో అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం(ఏఐజీడీఎస్‌యూ) మహాసభను ఆదివారం నిర్వహించారు. ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన అనంతపురం డివిజన్-గుంతకల్లు బ్రాంచ్ 8వ ద్వైవార్షిక మహాసభకు ఎంపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గ్రామీణ తపాల ఉద్యోగులుగా మీకు న్యాయంగా దక్కాల్సిన వాటిపైన ప్రజా ప్రతినిధిగా పార్లమెంట్‌లో ప్రస్తావిస్తానని హామీనిచ్చారు. మీ పోరాటంలో నిజాయతీ ఉందని, పట్టణ, గ్రామీణ ఉద్యోగులు పోటీతత్వంతో పనిచేస్తూ తపాలా శాఖ అభివృద్ధికి కృషి చేస్తుండటం అభినందనీయమని ప్రశంసించారు. రాష్ట్ర ప్రతినిధిగా గ్రామీణ తపాల ఉద్యోగుల సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

కనీస వేతనం రూ.24వేలు ఇవ్వాలి

: వెంకటేశ్వర్లు, జాతీయ అధ్యక్షుడు

తపాలా శాఖకు 85శాతం ఆదాయాన్ని గ్రామీణ తపాలా ఉద్యోగులు సమకూరుస్తున్నారని జాతీయ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం సరైన పెన్షన్ తీసుకోలేక దయనీయమైన స్థితిలో గ్రామీణ తపాలా ఉద్యోగులున్నారని వాపోయారు. 40ఏళ్ల నుంచి పనిచేస్తున్నా రూ.10వేల నుంచి రూ.14,500 మాత్రమే జీతం తీసుకుంటున్నారని, సీనియార్టీ ప్రకారం ఇంక్రిమెంట్లు కూడాలేవని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ తపాల ఉద్యోగులపట్ల కేంద్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందన్నారు. ఉద్యోగుల శ్రమను దోపిడీ చేస్తోందని మండిపడ్డారు. గ్రామీణ తపాల ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, కనీస వేతనం రూ.24వేలు ఇవ్వాలన్నారు. రూ.5లక్షల ప్రమాద బీమాను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

నాలుగు దశాబ్దాలుగా ఉద్యమం

: కృష్ణయ్య యాదవ్, డివిజన్ కార్యదర్శి

గ్రామీణ తపాలా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని నాలుగు దశాబ్దాలుగా ఉద్యమం చేస్తున్నామని డివిజన్ కార్యదర్శి కృష్ణయ్య యాదవ్ తెలిపారు. ఉద్యోగులను వేధిస్తున్న తపాలా శాఖ శాఖ సూపరింటెండెంట్ తీరును ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించి బదిలీ చేయించారన్నారు. ఇందుకు ఉద్యోగులందరూ కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. తపాలా శాఖ టార్గెట్లను చేరేందుకు అరకొర జీతాలను సైతం పెట్టుబడిగా పెట్టాల్సి వస్తోందని వాపోయారు. ఉద్యోగులను రెగ్యులర్ చేయకపోవడంతో వివక్షను ఎదుర్కోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. తమ సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని ఎంపీని కోరారు. అనంతరం ఏఐజీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను ఘనంగా సన్మానించి, ఆయన చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కేశవరావు, రమణారెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు మర్రెడ్డి, జమాల్‌బాషా, శశికుమార్, శ్రీరాములు నాయక్, రామాంజనేయులునాయక్, సూర్యనారాయణరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులు, మధు, శ్రీనివాసులు, రాజ్యలక్ష్మి, అనురాధ, మమత, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో జగన్ ఫొటో ఉంటే రోడ్డుపై పడేయండి

పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పిలుపు

ఉనికిని కోసమే వైసీపీ నేతల వెంపర్లాట అంటూ ధ్వజం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

అనంతపురం, మే 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లో జగన్ ఫొటో ఉంటే రోడ్లపై పడేయాలని మడకశిర ఎమ్మెల్యే టీటీడీ బోర్డు సభ్యుడు ఎంఎస్ రాజు.. టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వాధినేతగా... రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఆ పదవిలో ఎవరున్నా గౌరవించాలన్నారు. ఎవరు అగౌరపర్చినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం రోడ్లు, భవనాల అతిథి గృహంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో వైసీపీకి ప్రజలు సమాధి కట్టినా.. ఆ పార్టీ నేతలకు ఇంకా బుద్ధి రాలేదని మండిపడ్డారు. ఉనికి కోసమే ఎవరికి వారు వెంపర్లాడుతున్నారని రెండు రోజుల క్రితం ఎస్పీని కలిసిన వైసీపీ నేతలకు చురక అంటించారు. జడ్పీ సమావేశం నిర్వహించిన రోజున చైర్‌పర్సన్ కార్యాలయం వద్దకు సహచర ఎమ్మెల్యేలు దగ్గుపాటి, అమిలినేనితో కలిసి తాను వెళ్లానన్నారు. అంతకు ముందు జరిగిన సమావేశం రోజున ఎమ్మెల్యే దగ్గుపాటి, మంత్రి సవితతో కలిసి తాము సీఎం చంద్రబాబునాయుడు ఫొటోను చాంబర్‌లో పెట్టాలని చైర్‌పర్సన్‌కు చెప్పామన్నారు. ఫొటోను చైర్‌పర్సన్ గిరిజమ్మకు ఇచ్చామని గుర్తు చేశారు. సీఎం చంద్రబాబు ఫోటోను స్టోర్ రూం పక్కన పెట్టి, జగన్‌రెడ్డి ఫొటోను చాంబర్‌లో ప్రాధాన్యత కలిగిన ప్రదేశంలో పెట్టారన్నారు. ఈ నేపథ్యంలోనే తాము ముగ్గురం కలిసి చైర్‌పర్సన్ చాంబర్‌కు జడ్పీ సీఈఓను పిలిపించి, ఇది పద్ధతికాదని మందలించామన్నారు. జగన్‌రెడ్డి ఫొటోను అక్కడి నుంచి తొలగించి, సీఎం చంద్రబాబు, జాతిపిత మహాత్మాగాంధీ ఫొటోలను పెట్టించామన్నారు. అంతేగానీ జడ్పీ చైర్‌పర్సన్‌ను ఎక్కడా నిందించలేదు, దూషించలేదన్నారు. ప్రభుత్వం మారి ఏడాదవుతున్నా.. సీఎం ఫొటో బదులుగా జగన్‌ది పెట్టడంపై తాము సీఈఓను నిలదీస్తే.. వైసీపీ నాయకులు, కార్యకర్తలకు తప్పుగా అనిపిస్తుందా..? అని ప్రశ్నించారు. జడ్పీ చైర్‌పర్సన్ కూర్చునేది ప్రభుత్వ కార్యాలయంలో... అక్కడ సీఎం ఫొటో ఎందుకులేదని నిలదీసినందుకు తమను రౌడీలు, గూండాలంటూ తప్పుడు కేసులు పెడతారా..? అని మండిపడ్డారు. తమపై పోలీసులకు ఎవరైతే ఫిర్యాదు చేశారో ఆ మాజీ ఎంపీ రంగయ్య, ఇతర నాయకులు ఉనికి కోల్పోవడంతోనే... జగన్‌రెడ్డి దగ్గర మార్కులు కొట్టేసేందుకు అనవసర రాద్ధాంతం చేస్తున్నారన్నది ప్రజలకే కాదు... వైసీపీ శ్రేణులకూ అర్థమవుతోందన్నారు. రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారడంతో ఏం చేయాలో దిక్కుతోచక, నాలుగు రోజుల క్రితం జరిగిన ఘటనను పెంచి, పెద్దది చేసి ప్రజలను తప్పుదోవ పట్టించాలని వైసీపీ నేతలు ప్రయత్నాలు చేయడం సిగ్గుచేటన్నారు. రంగయ్య, మాధవ్ నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఏ ప్రభుత్వ కార్యాలయంలోనైనా జగన్ ఫొటో ఉంటే అందుకు సంబంధిత అధికారే బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. అధికారులు జాగ్రత్తపడాలని సూచించారు. ప్రతి నెలా ప్రభుత్వం నుంచి అలవెన్స్‌లు, భత్యాలు తీసుకుంటున్న వ్యక్తికి సీఎం ఫొటో పెట్టుకోవాలన్న జ్ఞానం ఉండదా..? అని నిలదీశారు. సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలు ప్రభుత్వ కార్యాలయాల్లో పెట్టాలని మొదటి క్యాబినెట్ భేటీలోనే తీర్మానం చేయడంతోపాటు అన్ని శాఖలకు ఆ నోట్ పంపించి, అమలు చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఉన్నా... జడ్పీ సీఈఓ అమలు చేయకపోవడం బాధ్యతారాహిత్యం కాదా..? అని నిలదీశారు. మాజీ ఎంపీ రంగయ్య ఒక్కసారే చట్టసభలకు వెళ్లాడన్నారు. ఆయన కుటుంబానికి రాజకీయ నేపథ్యమేమీ లేదన్నారు. తనతోపాటు ఎమ్మెల్యేలు దగ్గుపాటి, అమిలినేని సరేంద్రబాబు రాజకీయాల్లో కిందిస్థాయి నుంచి కష్టపడి పైకొచ్చామన్నారు. టీడీపీ అధిష్టానం నుంచి సీట్లు తెచ్చుకొని, ప్రజాక్షేత్రంలో గెలిచామన్నారు. వైసీపీ నేతల తరహాలో జాక్‌పాట్‌లో తాము సీట్లు తెచ్చుకోలేదని రంగయ్య, మాధవ్‌కు ఘాటుగా బదులిచ్చారు. ఫోటో వివాదం అసలు విషయమే కాదన్నారు. రంగయ్య గతంలో ఉద్యోగిగా పనిచేసిన సమయంలో ఆయన అక్రమాలపై ఎవరైనా గొడవ చేస్తే కుల సంఘాన్ని మభ్యపెట్టి, తనకు అనుకూలంగా ధర్నాలు, నిరసనలు చేయించుకున్న నీచ చరిత్ర ఆయనది కాదా అని ప్రశ్నించారు. గతంలో సీఐగా పనిచేసి, ఎంపీ అయిన గోరంట్ల మాధవ్‌కు కనీసం చట్టం, ప్రజాస్వామ్యంపై అవగాహన లేదని మండిపడ్డారు. అతనికి సీఐగా పనిచేయడం కంటే అవినీతిపరుల అడుగులకు మడుగులొత్తేది మాత్రమే తెలుసని ధ్వజమెత్తారు. ఇలాంటి నాయకులా తమపై చర్యలు తీసుకోవాలని కోరేదని ఎద్దేవా చేశారు.

ఇరువర్గాల ఘర్షణ

కొడవళ్లు, రాడ్లు, కట్టెలతో పరస్పర దాడులు

ఎనిమిదిమందికి తీవ్రగాయాలు

ధర్మవరం మండలం ఏలుకుంట్లలో ఘటన



చికిత్స పొందుతున్న శ్రీనివాసులు, అప్పస్వామి

ధర్మవరంరూరల్, మే25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏలుకుంట్ల గ్రామంలో ఆదివారం రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. రూరల్ పోలీసులు, గ్రామస్థులు తెలిపిన మేరకు గ్రామానికి చెందిన బొగ్గు నాగరాజు, తిరువీధుల విజయ్ రెండేళ్ల కిందట వ్యక్తిగత కారణాలతో ఘర్షణ పడ్డారు. అప్పట్లో కేసులు కూడా నమోదయ్యాయి. ఆ కక్షలు అలాగే రగులుతూ ఉన్నాయి. ఈక్రమంలోనే తిరువీధుల విజయ్ ఆదివారం చెరువు సమీపంలోకి వెళ్లాడు. అక్కడ తోటవద్దకు వెళుతున్న బొగ్గు నాగరాజు ఎదురుపడ్డాడు. పాత ఘటనల నేపథ్యంలో ఇద్దరూ వాగ్వాదం చేసుకుంటూ గొడవ పడ్డారు. తర్వాత తిరువీధుల విజయ్ గ్రామంలోకి చేరుకుని కుటుంబసభ్యులు, బంధువులకు జరిగిన విషయం తెలిపి, దాడికి సిద్ధమయ్యాడు. బొగ్గు నాగరాజు కూడా తమ వర్గీయులతో కలిసి కొడవళ్లు, ఇనుపరాడ్లు, కట్టెలు తీసుకుని విజయ్‌వర్గీయులపై దాడులకు దిగాడు. ఈ దాడిలో తిరువీధుల విజయ్, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, అప్పస్వామిలకు తల, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. తిరువీధుల విజయ్‌వర్గీయుల దాడిలో బొగ్గు నాగరాజు, సత్యమయ్య, దామోదర్, ఓబుళమ్మకు గాయాలయ్యాయి. వీరిని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అప్పస్వామి, విజయ్‌లను మెరుగైన చికిత్సకోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు రెండు వర్గాలపై కేసులు నమోదు చేశారు. డీఎస్పీ హేమంత్‌కుమార్, రూరల్ ఎస్ఐ శ్రీనివాసులుతో కలిసి గ్రామానికి చేరుకుని ఘర్షణకు గల కారణాలపై ఆరాతీశారు. గొడవలు జరగకుండా స్పెషల్‌పార్టీ పోలీసులతో గట్టిబందోబస్తు ఏర్పాటుచేశారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

బైక్ అదుపు తప్పి ఇద్దరు.. ట్రాక్టర్ కింద పడి ఒకరు..



బోయ కల్యాణ్ మృతదేహం

శెట్టూరు, మే 25(ఆంధ్రజ్యోతి): రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆదివారం ముగ్గురు జిల్లావాసులు మరణించారు. ఒకు గాయపడ్డారు. శెట్టూరు మండలంలోని ఆంధ్ర-కర్ణాటక సరిహద్దులో ద్విచక్రవాహనం బోల్తాపడి ఇద్దరు యువకులు మృతిచెందారు. కళ్యాణదుర్గంలోని బోయగేరికి చెందిన బోయ కల్యాణ్ (26), బోయ శ్రీనివాసులు (27) స్నేహితులు. అవివాహితులు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు. స్వగ్రామానికి వచ్చిన వారు కర్ణాటక ప్రాంతానికెళ్లి ద్విచక్రవాహనంలో కళ్యాణదుర్గానికి ఆదివారం రాత్రి తిరుగు ప్రయాణమయ్యారు. ఆంధ్ర-కర్ణాటక సరిహద్దు ప్రాంతంలోని ఓ బ్రిడ్జి వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ఆ ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. అటుగా వెళ్లే వాహనదారులు గమనించి పోలీసులకు సమాచారాన్ని అందించారు. కర్ణాటక ప్రాంతమైన పరశురాంపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ కింద పడి..



వడ్ల చంద్రశేఖర్ (ఫైల్)

పామిడి(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 44వ జాతీయ రహదారి సమీపంలో ఆదివారం తెల్లవారుజామున ట్రాక్టర్ కింద పడి వడ్ల చంద్రశేఖర్(38) మృతి చెందాడు. రామకృష్ణ అనే యువకుడు తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. గార్లదిన్నె మండలం కల్లూరు ఆర్ఎస్ గ్రామానికి చెందిన వడ్ల చంద్రశేఖర్, స్థానిక పామిడమ్మ వీధికి చెందిన రామకృష్ణ శ్రీనిధి ధాబా వద్దకు టీ తాగడానికి ట్రాక్టర్‌లో వెళ్లారు. ధాబా మూసివేసి ఉండటంతో వెనుదిరిగారు. ఈక్రమంలో ఆన్‌లోనే ఉన్న ట్రాక్టర్‌ను చెరోవైపు ఎక్కే ప్రయత్నంలో గేరు, యాక్సిలరేటర్ మీద కాలు పెట్టారు. దీంతో ట్రాక్టర్ కదిలి కిందపడ్డారు. చంద్రశేఖర్ మీదుగా ట్రాక్టర్ వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. రామకృష్ణ గాయపడ్డాడు. చంద్రశేఖర్ మృతదేహాన్ని పామిడి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య లక్ష్మితోపాటు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతిభను ప్రోత్సహించేందుకే పురస్కారాలు

ఘనంగా కనకదాస ప్రతిభా పురస్కారాల ప్రదానం



సర్టిఫికెట్లు, జ్ఞాపిక ఇస్తున్న ఎంపీ పార్థసారథి, ప్రముఖులు

అనంతపురం విద్య, మే 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించడానికే కనకదాస ప్రతిభా పురస్కారాలు అందిస్తున్నట్లు వక్తలు పేర్కొన్నారు. గుత్తిరోడ్డులోని కనకదాస కల్యాణమండపంలో టెన్త్‌లో 550 మార్కులపైన, ఇంటర్‌లో 900 మార్కులపైన వచ్చిన విద్యార్థులకు పురస్కారాల ప్రదానోత్సవం ఆదివారం నిర్వహించారు. హిందూపురం ఎంపీ పార్థసారథి, మాజీ మేయర్ రాగే పరశురాం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్, ఆర్డీఓ మధులత ఇతర ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విద్యార్థులు క్రమ శిక్షణతో చదివితే ఉన్నత స్థితికి చేరవచ్చన్నారు. విద్యార్థులు బలమైన లక్ష్యం, సంకల్పంతో ముందుకెళ్లాలన్నారు. బాగా చదువుకుని ఐఏఎస్, ఐపీఎస్ వంటి కొలువులు సాధించాలని ఆకాంక్షించారు. తర్వాత టెన్త్, ఇంటర్‌లో ప్రతిభ చూపిన 320 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించారు. అంతకుముందు ఇండియా తరపున సౌత్ ఏషియా సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైన మహేష్‌ను, పోలీస్ డ్యూటీ మీట్‌లో మూడు బంగారు పతకాలు సాధించిన ఎస్ఐ కృష్ణమూర్తిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కురబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోరంపల్లి ఆంజనేయులు, జిల్లా అధ్యక్షుడు ఈశ్వరయ్య, డాక్టర్ మహేష్, కురుబ ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షులు వెంకటరాముడు, అధ్యక్షులు పద్మావతి, ప్రధానకార్యదర్శి నాగరాజు, కోశాధికారి ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర విద్యార్థులకు..



విద్యార్థులకు పురస్కారాలు అందజేసి సన్మానిస్తున్న నాయకులు

అనంతపురం సెంట్రల్, మే25(ఆంధ్రజ్యోతి): పదోతరగతిలో అత్యధిక మార్కులు సాధించిన వడ్డెర విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ఆదివారం అందజేశారు. నగరంలోని కాశీ విశ్వేశ్వర కోదండ రామాలయంలో ప్రతిభా పురస్కారాల సభను నిర్వహించారు. వడ్డెర సేవాసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సభకు ముఖ్య అతిగా జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ హాజరై మాట్లాడారు. రాజకీయ, ఆర్థిక, ఉద్యోగ ఇలా అన్నిరంగాల్లో దశాబ్దాల నుంచి వడ్డెర్లు వెనుకబడ్డారని తెలిపారు. వీటిని అధిరోహించాలంటే ఉన్నతవిద్య ఒక ఆయుధమన్నారు. ఆ దిశగా వడ్డెర విద్యార్థులను ప్రోత్సహించేందుకు వడ్డెర సేవాసంఘం కృషి చేస్తోందన్నారు. అనంతరం విద్యార్థులకు పురష్కారాలందజేసి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు మారుతీ ప్రసాద్, లోకనాథ్, గంగన్న, సూర్యబాబు, పీఎస్ రాయుడు, శంకర్, రాజశేఖర్, వెంకటేశులు, ప్రకాష్, రామాంజినేయులు, రాఘవేంద్రవర్మ తదితరులు పాల్గొన్నారు.

భర్త కనిపించడం లేదని ఫిర్యాదు



కోంనాథ్ (ఫైల్)

ధర్మవరం, మే 25(ఆంధ్రజ్యోతి): తన భర్త కోంనాథ్ కనిపించలేదని పట్టణంలోని శారదానగర్‌కు చెందిన నల్లజెన్ని వెన్నెల ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్టు టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. సీఐ తెలిపిన మేరకు కోంనాథ్ బేల్దారి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. కుటుంబ అవసరాల నిమిత్తం రూ.6లక్షల దాకా అప్పులు చేశాడు. అప్పు తిరిగి ఎలా చెల్లించాలో దిక్కుతోచడంలేదని తరచూ భార్యతో చెబుతూ మనోవేదన చెందేవాడు. ఇంటిని అమ్మి అప్పులు తీర్చాలని భార్యసలహా ఇవ్వడంతో సరే అన్నాడు. ఈ క్రమంలో కోంనాథ్ తెలిసిన వారి వద్ద డబ్బులు అప్పుగా అడిగానని, ఇప్పించుకుని వస్తానని చెప్పి ఈనెల 8న ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రయినా ఇంటికిరాలేదు. బంధువులు, తెలిసిన వాళ్ల వద్ద వెతికిన ప్రయోజనంలేకపోయింది. దీంతో వెన్నెల పోలీసులను ఆశ్రయించిందన్నారు.

దేశం గర్వించదగ్గ వ్యక్తి మురళీనాయక్



నివాళులర్పిస్తున్న లోకేశ్వర్‌నాయక్

గోరంట్ల, మే25 (ఆంధ్రజ్యోతి): వీరజవాన్ మురళీనాయక్ దేశం గర్వించదగ్గ వ్యక్తి అని, దేశం కోసం ప్రాణాలు అర్పించిన మహోన్నతుడని ఏపీఎస్‌టీసీ చైర్మన్, భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వశాఖ సభ్యుడు లోకేశ్వర్‌నాయక్ కొనియాడారు. మండలంలోని కళ్లితండాలోని మురళీనాయక్ నివాసానికి వెళ్లి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఆదివారం నివాళులు అర్పించారు. జవాన్ తల్లిదండ్రులు, జ్యోతిబాయి, శ్రీరామునాయక్‌లను పరామర్శించి, సమాధిని సందర్శించారు.

న్యూస్ బాక్స్

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి



సమావేశంలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు

కదిరిఅర్బన్, మే 25(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ చట్టం-2025ను రద్దు చేయాలని ముస్లిం పర్సనల్ లా బోర్డు జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఎన్జీవో హోమ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, బీఎస్పీ, తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. వక్ఫ్ లేదా ఏ మత సంస్థలకు సంబంధించిన చట్టాలనైనా రూపొందించే ముందు ప్రభుత్వం ఆయా మత విశ్వాసాన్ని ఆచరించే అన్ని భాగస్వామ్య పక్షాలతో సంప్రదింపులు జరపాలన్నారు. కొత్తచట్టాన్ని రూపొందించడానికి ముందు రాజ్యాంగ నిపుణులు ఆయా వర్గాలకు చెందిన ధార్మిక, మైనార్టీ, న్యాయ నిపుణులతో కమిటీని ఏర్పాటుచేసి, రాజ్యాంగ సూత్రాలతో అనుగుణంగా రూపొందించాలన్నారు. కార్యక్రమంలో పలువురు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్య



వంశీ (ఫైల్)

కదిరిఅర్బన్, మే 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎర్రగుంట్లపల్లికి చెందిన విద్యార్థి ఆదివారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన భాస్కర్‌నాయుడు, భార్గవి కుమారుడు వంశీ(21) అన్నమయ్యజిల్లా అంగళ్లలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. వేసవి సెలవులు కావడంతో ఇంటివద్దనే ఉన్నాడు. కొద్ది రోజులుగా మానసిక పరిస్థితి బాగాలేదని చెప్పేవాడని తల్లిదండ్రులు తెలిపారు. ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణకు యత్నం

- ఆరుగురిపై కేసు నమోదు

కదిరిఅర్బన్, మే 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైఎస్ఆర్ నగర్ సర్వేనెంబర్ 206లో ప్రభుత్వ స్థలాన్నికొంతమంది ఆక్రమించేందుకు ప్రయత్నించారు. వీఆర్‌ఓలు ఓబులేసు, ఇనయతుల్లా ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరుగురుపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి ఆదివారం తెలిపారు. ప్రభుత్వ స్థలంలో అక్రమంగా ప్రవేశించి, గుంతలు తీయడానికి ప్రయత్నిస్తున్న అరుణమ్మ, ఆమె భర్త కుర్లి శివారెడ్డి, లలిత, భర్త చిన్నారెడ్డి, లక్ష్మీదేవి, భర్త రాజారెడ్డిపై కేసు నమోదు చేశామని వివరించారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమించడానికి ప్రయత్నిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

నేడు ఉచిత వైద్య పరీక్షలు

తనకల్లు, మే 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కిమ్స్ సవేరా ఆసుపత్రి సహకారంతో ఉచిత గుండె, కంటి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నట్లుడాక్టర్ సాధియాషేక్ తెలిపారు. శిబిరంలో బీపీ, ఈసీజీ, జీఆర్‌బీఎస్, టూడీఈకో, పరీక్షలు ఉచితంగా చేస్తామన్నారు. గుండెనొప్పి, గుండెదడ, ఆయాసం, కళ్లు తిరగడం, ఛాతి బరువుగా ఉండడం, కాళ్లు వాపు, చమటలు పట్టడం లాంటి సమస్యలు ఉన్నవారు చికిత్సలు చేయించుకోవాలని తెలిపారు. బస్టాండ్ వద్ద మదనపల్లి రోడ్డులో చికిత్సల చేస్తామన్నారు. సోమవారం ఉదయం 10 నుంచి 2గంటల వరకు డాక్టర్లు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

ఓబుళదేవరచెరువు, మే 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామిరెడ్డిపల్లికి చెందిన రంగరాజు అనే వ్యక్తికి ఆదివారం రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. రంగరాజు ద్విచక్రవాహనంలో స్వగ్రామం నుంచి మండల కేంద్రమైన ఓడీసీకి వెళ్తుండగా హైవేపై ద్విచక్రవానం అదుపు తప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని చికిత్సల నిమిత్తం 108 వాహనంలో కదిరికి తరలించారు.

ప్రతిఒక్కరూ దేశభక్తి కలిగి ఉండాలి

ధర్మవరం, మే 25(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ దేశభక్తి కలిగి ఉండాలని ఆర్ఎస్ఎస్ బౌద్ధిక్ ప్రముఖ్ కిశోర్, జిల్లా సహాయకార్యదర్శి శరత్ పేర్కొన్నారు. పట్టణంలోని శివానగర్‌లో జీహేశ్వర భజన మందిరంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఆర్ఎస్ఎస్ ప్రారంభిక వర్గ కార్యక్రమం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ ప్రారంభిక వర్గాలు స్వామి వివేకానంద, నేతాజీ, బాలగంగాధర్‌తిలక్, డాక్టర్ అబ్దుల్‌కలాం తదితర మహనీయుల ఆశయాలను నిజం చేయాలన్నారు. నేటి యువతకు మానసిక, శారీరక శిక్షణ ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ముఖ్యులు రామాంజనేయులు, నరసింహ, అరవింద, ఉమామహేశ్, తిరుమలేశ్ పాల్గొన్నారు.

మహానాడుకు తరలిరండి

పుట్టపర్తిరూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనారిటీ అభ్యున్నతే ధ్యేయంగా పనిచేస్తున్న తెలుగుదేశంపార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహానాడుకు జిల్లాలోని ముస్లింలు తరలిరావాలని రాష్ట్ర ముస్లిం మైనారిటీ విభాగపు కార్యదర్శి మహమ్మద్‌రఫీ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఈనెల 27, 28, 29 తేదీలలో తెలుగుదేశంపార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా కడపలో నిర్వహిస్తున్న మహానాడుకు జిల్లాలోని ముస్లింలు తరలివచ్చి జయప్రదం చేయాలని తెలిపారు.

శ్రీకృష్ణ మందిర నిర్మాణానికి విరాళం

ముదిగుబ్బ, మే 25(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ మందిర నిర్మాణానికి ముదిగుబ్బ మండల టీడీపీ నాయకుడు చినగాని నరసింహ యాదవ్ రూ. 10వేలు విరాళం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. తలుపుల మండలంలోని పెద్దన్నవారిపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీకృష్ణ మందిరం అభివృద్ధి కోసం విరాళాలు సేకరించడానికి ఆదివారం గ్రామస్థులు రావడంతో తనవంతుగా విరాళం ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మర్రి రామయ్య యాదవ్, భరత్ యాదవ్, గంగాధర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీకృష్ణ మందిరం కరపత్రాన్ని అందజేస్తున్న యాదవ సంఘం నాయకులు

కాడెద్దులు కనుమరుగు..!

● యంత్ర పరికరాలతో పెరుగుతున్న పెట్టుబడులు ● భారమవుతున్న వ్యవసాయం





పొలంలో ట్రాక్టర్‌తో దుక్కులు చేస్తున్న దృశ్యం.. చిన్న పనులకు ఉపయోగిస్తున్న ఎద్దుల బండి

ఓబుళదేవరచెరువు, మే 25(ఆంధ్రజ్యోతి): గతంలో దుక్కి దున్నాలన్నా, విత్తాలన్నా కాడెద్దులు, బండి కావలసిందే. వ్యవసాయంలో ఎద్దులతో రైతులకు వీడరాని బంధం ఉండేది. రైతుల జీవితంలో కాడెద్దులు ముఖ్యపాత్ర పోషించేవి. పొలంలో దుక్కులు, విత్తనం వేసినప్పటి నుంచి పండిన పంటలు ఎద్దుల బండిలో ఇంటికి చేరేవరకు ఎద్దులే కీలకంగా పనిచేసేవి. ప్రధానంగా వేరుశనగ, వరి, రాగి, సజ్జ, మొక్కజొన్న, కందిసాగులో కాడెద్దులు ఎంతో శ్రమించేవి. గతంలో గ్రామాల్లో రెండు, మూడు ఎకరాల పొలాలున్న రైతుల ఇళ్ల వద్ద ఎక్కడ చూసినా ఎద్దులు కనిపించేవి. ప్రస్తుతం కాడెద్దులు కనబడడం కష్టతరంగా మారింది. మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయంలో యంత్రాల పాత్ర పెరిగిపోతోంది. ఎద్దులతో ఒకటిరెండురోజుల్లో చేసే పనులు యంత్రాలతో రెండుమూడు గంటల్లో జరుగుతున్నాయి. దీంతో వ్యవసాయంలో కాడెద్దులు కట్టే రైతులు కనుమరుగవుతున్నారు. గతంలో ఎద్దులబండ్లు, ఎద్దులు కనిపించే స్థానంలో ప్రస్తుతం ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలు కనిపిస్తున్నాయి. దీంతో నేడు రైతులకు పెట్టుబడి విపరీతంగా పెరిగి వ్యవసాయం భారంగా మారుతోంది. గతంలో వ్యవసాయ సీజన్ ప్రారంభానికి ముందే రైతులు ఎద్దులబండ్లను సిద్ధం చేసుకునేవారు.

భారమవుతున్న వ్యవసాయం

మారుతున్న కాలానుగుణంగా టెక్నాలజీ పెరగడంతో వివిధ యంత్ర పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. తద్వారా రైతులకు భారమైనప్పటికి తప్పనిసరి పరిస్థితుల్లో యంత్ర పరికరాలవైపు మొగ్గు చూపుతున్నారు. పంట పెట్టుబడులు పెరగడం, ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోవడంతో రైతులు ప్రతియేటా నష్టాల్లో కూరుకుపోతున్నారు. డీజిల్, పెట్రోల్ ధరలు పెరగడంతో రైతుల మీద యంత్రాల భారం మరింత పడుతోంది. గంటకు ట్రాక్టర్‌తో దుక్కులు దున్నడానికి రూ.1000, పాయడానికి రూ.1200, విత్తనాలు విత్తడానికి రూ.1300 ధరలు నిర్ణయించారని రైతులు అంటున్నారు. కొంతమంది రైతులు వ్యవసాయంపై మక్కువ ఉన్నా పెట్టుబడుల భారం భరించలేక పొలాలను బీడుగా వదిలేస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఇతర ప్రాంతాలకు వలస కూలీలుగా వెళుతున్నారు.

పెట్టుబడులు రెట్టింపు



రాను రాను వ్యవసాయం భారమవుతోంది. గతంలో పెట్టిన పెట్టుబడులకు ప్రస్తుతం రెట్టింపు పెట్టుబడులు పెట్టాల్సి వస్తోంది. దీంతో సగానికి పైగా వ్యవసాయం తగ్గించాల్సి వస్తోంది. గతంలో ఐదు ఎకరాల్లో పంటలు సాగుచేస్తే, ప్రస్తుతం వ్యవసాయం ఆర్థిక భారంతో సగానికి పైగా తగ్గించుకోవాల్సి వస్తోంది. సబ్సిడీలు కల్పించి ప్రభుత్వమే రైతులను ఆర్థికంగా ఆదుకోవాలి.

- రాజారెడ్డి, రైతు, నారప్పగారిపల్లి

యంత్రాల భారం భరించలేం



ప్రస్తుతం కాడెద్దులు కరువుకావడంతో యంత్రాలకు డిమాండ్ పెరిగింది. గత్యంతరం లేక యంత్రాలను ఆశ్రయించాల్సి వస్తోంది. ట్రాక్టర్ల బాడుగలు ప్రతి సంవత్సరం పెంచేస్తున్నారు. దీంతో వ్యవసాయం చేయాలంటే భయపడే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి. వెంటనే సబ్సిడీతో వేరుశనగ కాయలు పంపిణీ చేయాలి.

-రజావత్ సత్యనారాయణనాయక్, రైతు, వెంకటాపురం

గాయపడిన వ్యక్తికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



అప్పస్వామిని పరామర్శిస్తున్న గోనుగుంట్ల సూర్యనారాయణ

ధర్మవరంరూరల్, మే 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏలుకుంట్ల గ్రామంలో ఇరువర్గాలు ఘర్షణపడి అప్పస్వామి అనేవ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ తన అనుచరులతో కలిసి ఆదివారం రాత్రి ఆసుపత్రికి వెళ్లి అప్పస్వామిని పరామర్శించారు. జరిగిన విషయంపై అడిగి తెలుసుకున్నారు.

చిరుత సంచారంతో జనం ఆందోళన

ఓబుళదేవరచెరువు, మే25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లవారిపల్లి, బలిజపల్లి పరిసర ప్రాంతాల్లో చిరుత సంచరిస్తుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గొల్లవారిపల్లి సమీపంలో టీడీపీ మండల కన్వీనర్ జయచంద్ర బోరు బావి వద్ద, ఎద్దులకొండ సమీపంలో చిరుత సంచరిస్తోంది. ఈక్రమంలోనే ఓ జింక పిల్లను చంపి నోటకరుచుకుని వచ్చినట్లు తెలిసింది. సగం తిని, మిగిలిన సగం కళేబరాన్ని అక్కడే వదిలేసింది. రాత్రి అయితే అటవీ సమీప గ్రామ ప్రజలు చిరుత భయంతో కంటిమీద కునుకు లేకుండా గడుపుతున్నారు. అటవీ అధికారులు పరిసర ప్రాంతాన్ని పరిశీలించి, చిరుతను బంధించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

నల్లచెరువు (కదిరి), మే 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బందారుచెట్లపల్లికి చెందిన ఆకుల చంద్రశేఖర్ నివాసంలో బెల్టు షాపు నడుపుతున్నట్లు సమాచారం రావడంతో ఆదివారం పోలీసులు సోదాలు నిర్వహించారు. అతడి వద్ద ఉన్న కర్ణాటక మద్యం 10 బాటిళ్లు సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మగ్బుల్‌బాషా తెలిపారు.

ప్రభుత్వాస్పత్రికి రూ.13.50 లక్షలు మంజూరు

ధర్మవరం, మే 25(ఆంధ్రజ్యోతి): ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రిలో అభివృద్ధి పనుల కోసం వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ రూ.13.50లక్షలు నిధులు మంజూరు చేయించినట్టు మంత్రి కార్యాలయ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చే ప్రజల సౌకర్యార్థం అంతర్గత తారు రోడ్డు నిర్మాణం, మరుగుదొడ్ల మరమ్మతులకు ఈ నిధులు మంజూరు చేశారని తెలిపారు. ఆసుపత్రిలో నూతన భవన నిర్మాణానికి ఇప్పటికే నిధులు మంజూరు చేయించారని వివరించారు.

ఓడీసీకి చేరిన మహానాడు సైకిల్ యాత్ర



సైకిల్ యాత్రకు స్వాగతం పలుకుతున్న మండల నాయకులు

ఓబుళదేవరచెరువు, మే 25(ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో ఈ నెల 27,28,29 తేదీల్లో తలపెట్టిన టీడీపీ మహానాడు సభకు పెనుకొండ నుంచి తలపెట్టిన సైకిల్ యాత్ర ఆదివారం మండల కేంద్రానికి చేరుకుంది. 44వ మహానాడు సందర్భంగా 44సైకిళ్లతో సైకిల్ యాత్ర పెనుకొండలో ఆదివారం ఉదయం ప్రారంభించినట్లు టీడీపీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శి వీరాంజి, ఐటీడీపీ రాష్ట్ర కార్యదర్శి పవన్, తెలిపారు. పాదయాత్ర ఓడీసీ మండల కేంద్రానికి చేరుకోగానే ఎస్సీఎస్టీ సెల్ రాష్ట్ర నాయకులు శ్రీనివాసనాయక్, బీజేపీ మండల కార్యదర్శి వీరాంజి, నాయకులు షబ్బీర్, రాయల్ కుమార్, జయరామిరెడ్డి తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి నరేష్‌యాదవ్, నాయకులు రఫీక్, మస్తానమ్మ తదితరులు పాల్గొన్నారు.

పార్కులో విరిగిన జిమ్ పరికరాలు పట్టించుకోని మున్సిపల్ అధికారులు



గాంధీనగర్ పార్కులో విరిగిపోయిన ఓపెన్ జిమ్ పరికరాలు

ధర్మవరంరూరల్, మే 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీనగర్ మున్సిపల్ పార్కులో ఏర్పాటు చేసిన ఓపెన్‌జిమ్ పరికరాలు తుప్పపట్టి విరిగిపోయాయి. రూ.లక్షలు వెచ్చించి పార్కును ఏర్పాటు చేసి ప్రజల సౌకర్యార్థం జిమ్ పరికరాలు ఏర్పాటు చేశారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రజలు పార్కుకు వెళ్లి సేద తీరుతుంటారు. జిమ్ చేసుకునేందుకు ఏర్పాటు చేసిన పరికరాలు తుప్పపట్టి విరిగిపోయి అక్కడే పడిపోయాయి. మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో అవి వృథాగా పడిపోయాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి నూతన జిమ్ పరికరాలను ఏర్పాటు చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.

అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనాలు


● అద్దె వాటిలోనే నిర్వహణ ● కొత్త ప్రభుత్వంలోనైనా పూర్తయ్యేనా..?

నల్లచెరువు (కదిరి), మే 25(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేక చిన్నారులు ఇక్కట్లు పడుతున్నారు. నిర్మాణాలు ప్రారంభించినా అవి పూర్తి కాకపోవడంతో అద్దె భవనాల్లోనే కొనసాగించాల్సి వస్తోంది. నల్లచెరువు మండలంలో 55 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల్లో 376 మంది చిన్నారులు విద్యనభ్యసిస్తున్నారు. 55 కేంద్రాల్లో 28 కేంద్రాలకు సొంతభవనాలుండగా, 27 కేంద్రాలు అద్దె భవనంలో కొనసాగుతున్నాయి. సొంతభవనాలు లేని కొన్ని కేంద్రాలకు అధికారులు నూతన భవనాలు మంజూరుచేశారు. 2018లో ఏడు కొత్త భవనాలను అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. అందులో 5 భవనాలు అసంపూర్తిగా ఉండగా రెండు భవనాలు పూర్తి చేశారు. తరువాత అధికారం చేపట్టిన ప్రభుత్వం అంగన్‌వాడీ భవనాల నిర్మాణం పట్టించుకోకపోవడంతో ఆయా గ్రామాల్లో భవనాలు అసంపూర్తిగా దిష్టి బొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. మరికొన్ని ముళ్ల పొదలతో నిండిపోయాయి. గత టీడీపీ పాలనలో మంజూరైన అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు ఇప్పుడయినా పూర్తవుతాయా అని ఆయా గ్రామాల ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఏడు అంగన్‌వాడీ భవనాలకు రూ.49 లక్షలు నిధులు మంజూరు చేశారు. మండల కేంద్రంలో అంగన్‌వాడీ భవనం, నడింపల్లి అంగన్‌వాడీ భవనం 70 శాతం, గోరంట్లపల్లి, గోర్లవాండ్లపల్లి గ్రామాల్లోని కేంద్రాలు 50 శాతం, కె. పూలకుంట గ్రామంలో 30 శాతం పనులు పూర్తయ్యాయి. పోలేవాండ్లపల్లి, బోగినేపల్లి కేంద్రాలను పూర్తి చేశారు.

నిధులు పెంచినా పనులు పూర్తికాలేదు

గతంలో ఒక భవన నిర్మాణానికి రూ.7లక్షలు ఉండేది. ప్రస్తుతం రూ.2.90 లక్షలకు పెంచారు. ధరలుపెరగడంతో నిర్మాణం పూర్తిచేయడానికి కాంట్రాక్టర్లు ముందుకురాలేదు. కాంట్రాక్టర్లు ముందుకు వస్తే పనులు చేయడానికి సహకరిస్తాం.

-గురురాజ గుప్తా, ఏఈ





కె.పూలకుంట అంగన్‌వాడీ భవనంలో ముళ్లపొదలు, నడింపల్లిలో అసంపూర్తిగా నిలిచిపోయిన భవనం

వెంగమునిస్వామి సన్నిధిలో శ్రీరామ్



వెంగమునిస్వామిని దర్శించుకుంటున్న పరిటాల శ్రీరామ్

ముదిగుబ్బ, మే 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిమ్మనాయనిపాళ్యం గ్రామంలో వెలసిన వెంగమునిస్వామిని ఆదివారం ధర్మవరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ దర్శించుకున్నారు. తిమ్మనాయనిపాళ్యంలో జరిగిన ఒక కార్యక్రమానికి హాజరైన ఆయన గ్రామంలోని మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. అనంతరం స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమేష్‌బాబు, తుమ్మల మనోహర్, కోట్ల బాబి, నరసింహయాదవ్, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సప్పలమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో సప్పలమ్మ

గాండ్లపెంట, మే 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొల్లుగుంట్లపల్లిలో సప్పలమ్మ జాతర వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. సప్పలమ్మ జాతర సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోలాటలు, చెక్కభజనలు, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు చేశారు. బండ్ల మెరవణి ఏర్పాటు చేశారు. అమ్మవారికి జ్యోతులు, బోనాలు సమర్పించారు.

పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో పెద్దమ్మతల్లి

ముదిగుబ్బ, మే 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పాతవూరులో వెలసిన గ్రామదేవత పెద్దమ్మతల్లికి ఆదివారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. తెల్లవారుజామున అమ్మవారికి వెండి ఆ భరణాలు, కిరీటాలు, భుజకిరీటాలు, బంతిపూలు, వేపమండలతో అలంకరిం చి, పూజారులు పెద్దన్న, శివసాయి ప్ర త్యేక పూజలు చేశారు. మహిళలు పెద్దమ్మతల్లికి వడిబియ్యం, చీరలు, పసుపుకుంకుమలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

జీవహింస మానండి



మానవహారం ఏర్పాటు చేసిన పిరమిడ్ ధ్యానమందిరం సభ్యులు

బత్తలపల్లి, మే 25(ఆంధ్రజ్యోతి): జీవహింస ద్వారా వచ్చే మాంసాహారాన్ని మానుకోవాలని, శాకాహారాన్ని అలవాటు చేసుకోవాలని పిరమిడ్ ధ్యానమందిరం సభ్యులు తెలిపారు. మండల కేంద్రమైన బత్తలపల్లిలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. పిరమిడ్ ధ్యానమందిరం నుంచి నాలుగు రోడ్ల కూడలిలో వరకు ర్యాలీ కొనసాగింది. నాలుగు రోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. ప్రతిరోజూ ధ్యానం చేస్తే అనారోగ్యాలు దరి చేరవని తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు కొండన్న, నాయుడు, వెంకటరెడ్డి, వెంకటనారాయణ, గోపాల్, ప్రభాకర్, రమాదేవి పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం చేస్తున్న దృశ్యం

అమడగూరు (కదిరి), మే 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గాజులవారిపల్లి సమీపంలో వెలసిన శ్రీమాతృశ్రీ వృద్ధాశ్రమానికి అన్నదమ్ములు ఆదివారం ఆర్థికసాయం అందించారు. చల్లా రాజశేఖర్, చల్లా చంద్రశేఖర్ కలిసి రూ. 15 వేలు ఆర్థికసాయం అందించారు. దాతలకు ఆశ్రమ నిర్వాహకురాలు అరుణజ్యోతి కృతజ్ఞతలు తెలిపారు.

కిశోరి వికాసంపై శిక్షణ



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్

తనకల్లు, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటపల్లిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోరి వికాసంపై ఆదివారం శిక్షణ నిర్వహించారు. బాలికలకు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారం, బాల్యవివాహాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సమస్యలుంటే 100, 1098కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ, అంగన్ వాడీ కార్యకర్తలు, గ్రామస్థులు, బాలికలు పాల్గొన్నారు.

నేడు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

తనకల్లు, మే 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శోభాసువర్ణమ్మ తెలిపారు. అన్నిశాఖలాధికారులు తప్పకుండా హాజరుకావాలన్నారు.

● బత్తలపల్లి: మండలకేంద్రమైన బత్తలపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ స్వర్ణలత తెలిపారు. ప్రజల తమ సమస్యలపై అర్జీలు ఇవ్వవచ్చని సూచించారు.

సమస్యల పరిష్కారానికే మన్‌కీ బాత్

ధర్మవరం, మే 25(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించడానికే మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు 5వ వార్డు బీజేపీ నాయకులు పేర్కొన్నారు. వార్డులో బీజేపీ నాయకులు నవీన్‌కుమార్, రాజు, రమేశ్ తదితరులు మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని తిలకించారు. మన్ కీ బాత్ ప్రత్యేక సంభాషణ ద్వారా ప్రజల సమస్యలు, అభిప్రాయాలు పరిష్కరించడంతో పాటు అభివృద్ధి పనులు వేగవంతం చేయడానికి ఈ కార్యక్రమం వేదికగా నిలిచిందని నాయకులు పేర్కొన్నారు.

న్యూస్ బాక్స్

మహాలక్ష్మి అమ్మవారికి పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

పరిగి, మే 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గొరవనహళ్లి గ్రామంలోని మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో బ్రహ్మరుద్ర శివలింగానికి, అమ్మవారికి ఆదివారం హరిప్రాద్‌శర్మ ఆధ్వర్యంలో రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా శోభాయాత్ర, గోపూజ, మొక్కలు నాటే కార్యక్రమం మహన్యాసక పూర్వఏకాదశ రుద్రాభిషేకం చేశారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

క్రికెట్ టోర్నీ విజేత రంటవాళ జట్టు


ట్రోఫీ అందుకుంటున్న రంటవాళ జట్టు

అగళి, మే 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూలపల్లి టెన్నిస్‌బాల్ క్రికెట్ లీగ్ మెగా టోర్నీలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన రంటవాళ జట్టు విజేతగా నిలిచింది. పూలపల్లి స్నేహ జీవిబాయ్స్ జట్టు ద్వితీయస్థానాన్ని దక్కించుకుంది. రెండు రోజులుగా జరుగుతున్న ఈ టోర్నీలో 15జట్లు పాల్గొన్నాయి. ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో రంటవాళ జట్టు విన్నర్స్‌గా నిలిచింది. విజేత జట్టుకు అగళి మండల జడ్పీటీసీ ఉమేష్, యువనాయకులు సునీల్ రంగారెడ్డి, తిప్పేస్వామి రూ.20వేలు నగదుతోపాటు మెడల్స్ ట్రోఫీని అందించారు. రన్నర్‌గా నిలిచిన పూలపల్లి జీవీబాయ్స్ జట్టుకు కోడిపల్లి పంచాయతీ సర్పంచ్ నరసింహమూర్తి రూ.10వేలు నగదుతోపాటు మెడల్స్ ట్రోఫిని అందించారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని వారు పేర్కొన్నారు. మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ శివరాములు, నాయకులు రమేష్, జయప్ప, మల్లికార్జున, తిప్పేస్వామి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సభ్యత్వ కిట్ల పంపిణీ



సభ్యత్వ కిట్లు పొందిన వారు

పరిగి, మే 25(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ కిట్లను ఆదివారం పంపిణీ చేశారు. మోదా గ్రామంలోని ఆ పార్టీ కార్యాలయంలో జిల్లాసంయుక్త కార్యదర్శి శివ ఆధ్వర్యంలో పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలవ్యాప్తంగా 300మందికి కిట్లను అందించడం జరిగిందన్నారు. మండలంలోని జనసేన కార్యకర్తలకు ఎటువంటి సమస్యలైనా ఎదురైతే ఫోన్‌ద్వారా తెలిపితే పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం కమిటీ సభ్యులు రమేష్, విష్ణు, అశోక్, హనుమంతు, నారాయణస్వామి, శివశంకర్ పాల్గొన్నారు.

ముగిసిన కరాటే శిబిరం


బెల్టు గ్రేడింగ్ సాధించిన విద్యార్థులు

గోరంట్ల, మే25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌పీవీఎం డిగ్రీ కళాశాలలో విద్యార్థులకోసం ఏర్పాటు చేసిన కరాటే వేసవి శిబిరం ఆదివారం ముగిసింది. గోన్‌షీరో కరాటే అకాడమి మాస్టార్ శ్రీనాథ్ ఆధ్వర్యంలో వేసవి సెలవుల్లో శిక్షణ ఇచ్చారు. చివరి రోజు తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థులకు కరాటేలో గ్రేడింగ్ బెల్టులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ భక్తవత్సలం, రాజేష్‌కుమార్ పాల్గొన్నారు.

భోజనశాల నిర్మాణానికి భూమిపూజ


భోజనశాలకు భూమిపూజ చేస్తున్న జీఎం సురేష్

గోరంట్ల, మే25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలుర ఉన్నతపాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం భోజనశాల నిర్మాణానికి గోరంట్లకు చెందిన జీఎం సురేష్ ముందుకు వచ్చి ఆదివారం భూమి పూజ చేశారు. ఇటీవల పాఠశాలలో ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవంలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులు భోజనం తినడానికి భోజనశాల లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని హెచ్ఎం గోపాల్ ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సొంత ఖర్చుతో భోజనశాల నిర్మాణానికి ఆయన శ్రీకారం చుట్టారు. పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు ఆయనకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలసముద్రం గ్రామానికి చెందిన వృదురాలు నూర్జహాన్ విషద్రావకం తాగి ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. తనకుమారులు తన మాట వినడంలేదని తీవ్ర మనస్థాపానికి గురై విషద్రావకం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అస్వస్థతకు గురైనా ఆమెను కుటుంబ సభ్యులు గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా డాక్టర్ ఉష చికిత్స జరిపారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లోహిందూపురం ఆసుపత్రికి తరలించారు.

ఎన్నాళ్లీ ఇన్‌చార్జిల పాలన..?

అందుబాటులో ఉండని సిబ్బంది

ప్రజలకు తీవ్ర ఇబ్బందులు

ప్రస్తుత బదిలీల్లోనైనా రెగ్యులర్ పోస్టులు భర్తీ అయ్యేనా?



చిలమత్తూరు, మే 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఎంతో కాలంగా ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ ఇప్పుడైనా జరిగేనా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. మండలంలోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో పలు పోస్టులు కొంత కాలంగా ఖాళీగా ఉన్నాయి. ఆయా పోస్టులకు సంబంధించిన సేవలను పొందడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఖాళీగా ఉన్న పోస్టుల్లో ఎవరూ రాకపోవడంతో సమస్య ఎదురవుతోంది. అయితే ప్రస్తుతం ప్రభుత్వం ఉద్యోగుల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో మార్గం సుగమమైందని చెప్పవచ్చు. ప్రధానంగా తహసీల్దార్ పోస్టు చాలా కాలంలో ఇన్‌చార్జ్ అధికారితోనే నడుస్తోంది. రెగ్యులర్ తహసీల్దార్ లేక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కార్యాలయంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన ఆర్ఐ పోస్టులు రెండేళ్లుగా ఖాళీగా ఉన్నాయి. ఇప్పటికీ ఆ పోస్టులు భర్తీ కాలేదు. వీఆర్ఓ పోస్టులు కూడా ఖాళీగా ఉండటంతో పక్క గ్రామాల వీఆర్ఓలకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. దీంతో వారు పనిభారంతో సక్రమంగా విధులు నిర్వహించలేకపోతున్నారని ప్రజలు అంటున్నారు. ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లను ఇచ్చే కంప్యూటర్ ఆపరేటర్ పోస్టును సైతం భర్తీ చేయలేదు. దీంతో సర్టిఫికెట్లు, పట్టాదారు పాసుపుస్తకాల మంజూరులో జాప్యం జరుగుతోందని ప్రజలు అంటున్నారు. ఇటీవల ఎంపీడీఓగా నంద్యాల జిల్లా నుంచి కరుణాసాగర్ బాధ్యతలు చేపట్టారు. గ్రామ పంచాయతీల విషయానికి వస్తే ఈఓఆర్డీ పోస్టు చాలా కాలంగా ఖాళీగా ఉంది. సీనియర్ పంచాయతీ కార్యదర్శులకే ఇన్‌చార్జ్ బాధ్యతలు ఇస్తున్నారు. పంచాయతీ కార్యదర్శుల విషయానికి వస్తే కొన్నేళ్లుగా మండలంలో కార్యదర్శుల కొరత తీవ్రంగా ఉంది. దీంతో ఒక్కో కార్యదర్శి రెండు నుంచి మూడు పంచాయతీలకు ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తున్నారు. ప్రధానంగా మేజర్ పంచాయతీలుగా ఉన్న చిలమత్తూరు పంచాయతీకి రెగులర్ కార్యదర్శి లేరు. వీరాపురం కార్యదర్శికి ఇన్‌చార్జ్ బాధ్యతలు ఇచ్చారు. మరొక మేజర్ పంచాయతీ కోడూరుకి కార్యదర్శిగా ఉన్న వ్యక్తికి మరో రెండు పంచాయతీల బాధ్యతలు ఇచ్చారు. ఇప్పుడు జరుగుతున్న బదిలీల్లో కొత్త కార్యదర్శులు వస్తారా? లేక ఇన్‌చార్జ్‌లతోనే కాలం గడిపేస్తారా? అనే విషయం తెలియాల్సి ఉంది. ఇప్పుడు జరుగుతున్న బదిలీల్లో పోస్టులు భర్తీ అయితే ప్రజల సమస్యల పరిష్కారం కొంత వేగంగా జరగడానికి వీలు ఉంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. కాగా బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో తమకు అనుకూలమైన ప్రదేశానికి పోస్టులు ఇప్పించుకోవడం కోసం అధికారులు నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నట్లు సమాచారం.

ఎవరొచ్చినా సర్దుకుపోవడం కష్టమే..!

బదిలీపై ఎవరు మండలానికి వచ్చినా అధికార పార్టీ నాయకులతో సర్దుకుపోవడం ఉద్యోగులకు తలప్రాణం తోకకు రావడం ఖాయమని అంటున్నారు. ప్రధానంగా అధికార పార్టీలో రెండువర్గాలుగా ఉండటం కొంతవరకు అధికారులపై ఒత్తిడి ఉంటుందనేది స్పష్టంగా తెలుస్తోంది. ఇప్పటికే ఉన్న అధికారులు ఏ వర్గం నాయకుల మాటలు వినాలో...ఎవరి మాట వినకూడదో తెలియక సతమతమవుతున్నట్లు చర్చ జరుగుతోంది. ఒక వర్గం వారితో సన్నిహితంగా ఉంటే మరో వర్గం జీర్ణించుకోలేని పరిస్థితి ఉందని తెలుస్తోంది. ఈ పరిస్థితుల్లో బదిలీలపై వచ్చే ఉద్యోగులు అన్నింటికి సిద్ధపడి ఇక్కడకు రావాల్సి ఉంటుందని, ఏది ఏమైనా అధికార పార్టీలోని వర్గపోరు అధికారులపై తీవ్రమైన ప్రభావం చూపుతుందనడంలో సందేహం లేదన్న చర్చ సాగుతోంది.

మూతపడ్డ ఆయుష్ ఆస్పత్రులు

రోగులకు తప్పని తిప్పలు


మడకశిరలో మూతపడ్డ యునానీ ఆస్పత్రి

మడకశిర రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆయుష్ పరిధిలో ఉన్న యునానీ, హోమియోపతి ప్రభుత్వ ఆస్పత్రులకు డాక్టర్లు, సిబ్బంది లేక మూతపడ్డాయి. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మడకశిర, కల్లుమర్రి, శంకర్‌గల్, మొరుబాగల్, రొళ్ల, అమరాపురంలో ఆయుష్ ఆస్పత్రులు ఉన్నాయి. వీటిలో డాక్టరు, ఫార్మాసిస్టు, వర్కరు ఇలా ముగ్గురు ఉంటారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఇక్కడ మంచి చికిత్సలు అందేవి. గత ఐదేళ్ల వైసీపీపాలనలో ఈ ఆస్పత్రుల్లో బదిలీపై వెళ్లిన పోస్టుల్లో తిరిగి ఎవరినీ నియమించకపోవడంతో డాక్టర్లు, ఫార్మాసిస్టు, వర్కర్ లేక మూతపడ్డాయి. దీంతో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడువారు చికిత్సకు ఇబ్బందులు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో వైద్య రంగానికి పెద్దపీట వేశామని నాయకులు గొప్పలు చెప్పుకున్నారే తప్ప ఖాళీ అయిన పోస్టుల్లో ఎవరినీ కేటాయించలేదు. దీంతో ఆస్పత్రులు మూతపడ్డాయని రోగుల నుంచి విమర్శలు వస్తున్నాయి.

- మడకశిరలో యునానీ ఆసుపత్రి ఉంది. ఇందులో డాక్టరు, ఫార్మాసిస్టు పనిచేస్తుండేవారు. రోగులకు మంచి సేవలు అందించడం జరిగింది. నాలుగేళ్ల క్రితం ఇక్కడ పనిచేస్తున్న డాక్టరు బదిలీపై వెళ్లారు. ఫార్మాసిస్టు మాత్రమే ఉండేవారు. అతను కూడా పదవివీరమణ చేశారు. దీంతో ఆస్పత్రిలో సేవలు అందడంలేదు.
- కల్లుమర్రిలో ఉన్న ప్రభుత్వ హోమియో ఆస్పత్రిలో డాక్టర్ లేక ఎనిమిదేళ్లవుతోంది. నాలుగేళ్లపాటు ఫార్మాసిస్టుతోనే ఆస్పత్రి నడిచింది. అతను ఆకస్మికంగా మృతిచెందాడు. దీంతో రెండేళ్లపాటు ఆస్పత్రి మూతపడింది. తరువాత మరో ఫార్మాసిస్టును నియమించారకాని డాక్టర్‌ను కేటాయించలేదు. ఆమె సైతం డిప్యుటేషన్‌పై కొడిగేపల్లికి వెళ్లిపోయింది. దీంతో ఈ ఆస్పత్రి కూడా మూతపడింది.

మిగిలిన ఆయుష్ ఆస్పత్రుల పరిస్థితి కూడా ఇదేవిధంగా ఉంది. ఆయా ప్రాంతాల్లో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుత ప్రభుత్వం స్పందించి ఈ ఆస్పత్రులకు డాక్టర్లను, ఫార్మాసిస్టులను, వర్కర్లను కేటాయించి మూతపడిన ఆస్పత్రులను తెరిపించి వైద్యం అందేలా చూడాలని రోగులు కోరుతున్నారు.

సిబ్బందిని కేటాయించాలి

మూతపడ్డ ఆయుష్ ఆస్పత్రుల్లో సిబ్బందిని కేటాయించాలి. వైసీపీ పాలనలో ఈ ఆస్పత్రులను గాలికి వదిలేశారు. రోగులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు స్పందించి వెంటనే సిబ్బందిని నియమించి రోగులకు వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలి.



- మురళిబాబు, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు

తొగటవీర క్షత్రియులు రాజకీయంగా ఎదగాలి

తొగటవీరక్షత్రియ సంఘం సోమందేపల్లి అధ్యక్షుడు సీసీ హరి


మాట్లాడుతున్న సీసీ హరి

సోమందేపల్లి, మే 25(ఆంధ్రజ్యోతి): తొగటవీరక్షత్రియులు రాజకీయంగా ఎదగాలని సోమందేపల్లి తొగటవీరక్షత్రియ సంఘం అధ్యక్షులు సీసీహరి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని చౌడేశ్వరీ కల్యాణమండపంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న రాష్ట్ర యువజన సంఘం కార్యదర్శి టేకూరి శేషాద్రి, జిల్లా అధ్యక్షుడు దాసరి శ్రీరాములు, ధర్మవరం పట్టణ కార్యదర్శి పుల్లయ్య, మాజీ పట్టణ కార్యదర్శి శంకర్, యుగంధర్ కార్యక్రమంలో పాల్గొని ఆరుగురు సభ్యులను జిల్లా కమిటీకి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా టేకూరి శేషాద్రి మాట్లాడుతూ సోమందేపల్లి తొగటవీరక్షత్రియ సంఘం ఎనలేని సేవలను అందిస్తూ చేనేత కుటుంబాలను ఆర్థికంగా ఆదుకుంటోందన్నారు. సీసీహరి నేతృత్వంలో వారు చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి జిల్లా కమిటీలో చోటు కల్పించినట్లు తెలిపారు. రాబోవు రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేసి అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం ఎంపిక చేసిన సభ్యుల పేర్లను వెల్లడించారు. జిల్లా ఉపాధ్యక్షునిగా బండారు శ్రీనివాసులు, జిల్లా సహాయ కార్యదర్శిగా కేత రిశిష్వర్, కార్యదర్శిగా జగదీశ్‌లను ఎంపిక చేయగా ఈసీ సభ్యులుగా బండారు గోవిందు, బండారు రాజేష్, మారుతిలను ఎంపిక చేశామన్నారు. కార్యక్రమం అనంతరం సీసీహరిని సంఘం తరుపున ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రంగనగోపాల్, అమర్నాథ్, డీవీ అశోక్, దాసరి శ్రీనాథ్, చీల నారాయణస్వామి, శ్రీనివాసులు, సీతారాం, వేల్పుల శ్రీనివాసులు, కట్టు మహేంద్ర, రంగన ఉపేంద్ర, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

టోర్నీ ఫైనల్‌కు వీరజవాన్ తల్లిదండ్రులకు ఆహ్వానం



జవాన్ తల్లిదండ్రులను ఆహ్వానిస్తున్న యూత్ అసోసియేషన్ సభ్యులు

గోరంట్ల, మే25(ఆంధ్రజ్యోతి): వీరజవాన్ మురళీనాయక్ జ్ఞాపకార్థం కోడూరు యూత్ అసోసియేషన్ ఈ నెల 15 నుంచి క్రికెట్ టోర్నీ నిర్వహిస్తోంది. ఈ టోర్నీలో 50 జట్లు పాల్గొన్నాయి. ఈనెల 29న టోర్నీ ఫైనల్స్ నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఫైనల్స్ పోటీకి మురళీనాయక్ తల్లిదండ్రులను ముఖ్య అతిథులుగా హాజరవ్వాలని ఆదివారం కోడూరు యూత్ అసోసియేషన్ సభ్యులు ఆహ్వానించారు.

సైకిల్ యాత్రకు ఘన స్వాగతం

గోరంట్ల, మే25 (ఆంధ్రజ్యోతి): కడపలో జరగనున్న మహానాడులో పాల్గొనేందుకు పెనుకొండనుంచి సైకిల్ యాత్రగా వెళ్తున్న టీడీపీ తెలుగుయువతకు గోరంట్లలో ఆదివారం ఘనస్వాగతం లభించింది. మండలకన్వీనర్ బాలక్రిష్ణ చౌదరి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు పాలసముద్రం కూడలిలో వారికి స్వాగతం పలికారు. సైకిల్ యాత్ర ఎలాంటి ఆటకం లేకుండా సాగాలని నిమ్మల శ్రీధర్ నాలుగు సైకిల్ పంపులను తెలుగు యువత నాయకులకు ఇచ్చారు.


పాలసముద్రం వద్ద సైకిల్ యాత్రను స్వాగతిస్తున్న దృశ్యం


సోమందేపల్లి వద్ద...

సోమందేపల్లి, మే 25(ఆంధ్రజ్యోతి): పెనుకొండ నుంచి మహానాడుకు సైకిల్‌యాత్రగా వెళ్తున్న వారికి టీడీపీ నాయకులు సంఘీభావం తెలిపారు. నూతన కన్వీనర్ వెంకటేశులు, పట్టణ అధ్యక్షులు వడ్డిసురేష్, టీడీపీ మాజీ ఎంపీపీ కిష్టప్ప, డీఆర్ సోము, వీఎస్ రామాంజినేయులు, జేవీ ఆంజనేయులు, నల్లొండ్రాయనపల్లి వద్దకు చేరుకుని సైకిల్ యాత్రకు వెళ్తున్న యువగళం బృందానికి సంఘీభావం ప్రకటించారు.

సిద్ధేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

అమరాపురం, మే 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హేమావతి గ్రామంలో వెలసిన శ్రీసిద్ధేశ్వర స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ కరేగౌడ్ తెలిపారు. ఉదయం స్వామివారికి కంకుమార్చన, రుద్రాభిషేకం, తైలాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించడం జరిగిందన్నారు. సిద్ధేశ్వరస్వామిని, దొడ్డేశ్వరస్వామి, మల్లేశ్వర స్వామి, విరుపాక్షస్వాములకు వెండి కవచాలను ధరించి ప్రత్యేక పూలతో అలంకరించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు సిద్ధలింగేశ్వరస్వామి, శివకుమార్‌స్వామి, రవిశంకర్‌స్వామి, మహేష్‌కుమార్, గౌతమ్, ప్రదీప్ పాల్గొన్నారు.

కలశాలతో ఊరేగింపు


ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

హిందూపురం, మే 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టమీదపల్లి ఉప్పర, సగర కులస్థులు భగీరథ జయంతిని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. మిట్టమీదపల్లిలో భగీరథ చిత్రపటం ఏర్పాటుచేసి కలశాలతో ఊరేగింపుగా వెళ్లి సమర్పించారు. ఈ సందర్భంగా ఉప్పర, సగర నాయకులు భవిష్యత్తులో ఇక్కడ భగీరథ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉప్పర, సగర కులస్థులు రామాంజినప్ప, రామచంద్రప్ప, సోమయ్య, నరసింహమూర్తి, నరేష్, వినోద్, జగదీశ్, సడ్లపల్లి రామన్న, బాబు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి

\- హిందూపురం మున్సిపల్ చైర్మన్ రమేష్


విద్యార్థులు, తల్లిదండ్రులను సత్కరిస్తున్న అతిథులు

పెనుకొండ, మే 25(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నతస్థాయికి చేరాలని హిందూపురం మున్సిపల్ చైర్మన్ డీఈ రమేష్ సూచించారు. ఆదివారం స్థానిక విట్టా ఆంజనేయస్వామి కల్యాణ మండపంలో జిల్లా వాల్మీకి ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టెన్త్, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కార ప్రధానోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హిందూపురం మున్సిపల్ చైర్మన్ రమేష్‌కుమార్, ఎమ్మెల్సీ మంగమ్మ హాజరై ప్రసంగించారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి తమ లక్ష్యసాధనకు కృషి చేయాలన్నారు. ఉన్నత చదువులు చదివి అత్యున్నతస్థాయిలో స్థిరపడాలన్నారు. అనంతరం ప్రతిభచూపిన విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో వాల్మీకి ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి శివయ్య, కోశాధికారి రామక్రిష్ణ, గౌరవ సలహాదారుడు జగదీశ్, ఈశ్వరయ్య, ఎన్‌జీఓ నాయకులు నరసింహులు, పుట్టపర్తి జెడ్పీటీసీ గంగాధర్ హాజరయ్యారు.

కోనేరు స్థలంలో కంచె ఏర్పాటుకు యత్నం


కంచెను ఏర్పాటు చేస్తున్న దృశ్యం

సోమందేపల్లి, మే 25(ఆంధ్రజ్యోతి): గుడిపల్లి సజ్జగంట రంగనాథస్వామి ఆలయం కోనేరు సర్వేనంబరు 27-11లో ఉన్న 83సెంట్ల స్థలంలో 11సెంట్లను స్థానికంగా ఉన్న కొందరు ఆక్రమించి ఆదివారం కంచె ఏర్పాటుచేయడానికి యత్నించారు. గమనించిన స్థానికులు వారిని అడ్డుకుని ఆలయ ఈఓకు సమాచారం అందించారు. గతంలో అనేకమార్లు దేవదాయ భూమిని ఆక్రమించడానికి ప్రయత్నం చేశారని గ్రామస్థులు తెలిపారు. ఎన్నిసార్లు హెచ్చరించినా భూమి ఆక్రమణకు ప్రయత్నిస్తున్నారన్నారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టకపోతే సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి అవసరమైతే ధర్నా చేపడతామని గ్రామస్థులు హెచ్చరించారు.

దరఖాస్తు చేసుకోండి

హిందూపురం, మే 25(ఆంధ్రజ్యోతి): ఈ యేడాది పదవ తరగతి, ఇంటర్ పరీక్షా ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన కురుబ విద్యార్థులకు పురస్కారాలు అందజేయడం జరుగుతుందని ఆ సంఘం నాయకులు ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్‌లో 450మార్కులు, ఇంటర్‌లో 800మార్కులకు పైబడి సాధించిన విద్యార్థులు 9866819884, 9885749232లకు సంప్రదించాలన్నారు. ప్రతిభా పురస్కారాలు హిందూపురం తాలూకా పరిధిలోని విద్యార్థులకు మాత్రమేనని వీరికి పట్టణంలోని కనకదాసు కల్యాణమండపంలో సమావేశం ఏర్పాటుచేసి పురస్కారాలు అందజేయడం జరుగుతుందన్నారు.

ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేయడం సిగ్గుచేటు

చిలమత్తూరు, మే 25(ఆంధ్రజ్యోతి): జడ్పీ కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి ఫోటో కాదని, మాజీ సీఎం ఫోటో పెట్టుకోవడం ఏంటని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు సీఈఓని నిలదీసినందుకు వైసీపీకి చెందిన ఓ మాజీ ఎంపీ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయడం సిగ్గుచేటని ఏపీ ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బేకరీ గంగాధర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీల మాన ప్రాణాలను తుంగలో తొక్కి పబ్బం గడుపుకున్నారని, అలాంటి నాయకుడిని బీసీ నాయకుడు అంటూ ఈ ఎంపీ వత్తాసు పలకడం విడ్డూరంగా ఉందన్నారు. ఆయన అధికారంలో ఉన్నప్పుడు మహిళా లోకం తలదించుకునేలా ప్రవర్తించిన ఘటనలు ఎవ్వరూ మరచిపోలేదన్నారు. మానం మర్యాదలు విడిచిన నువ్వు ఈ రోజు ఒక ఎస్సీ కులానికి చెందిన ఎమ్మెల్యేను విమర్శించడం ఏంటని ప్రశ్నించారు. డాక్టర్ అంబేడ్కర్ దళితుల రక్షణకై రాజ్యాంగంలో ప్రత్యేక హక్కులు కల్పించారని, రాజకీయం చేయాలనుకుంటే మీ నాయకుడి వద్దకు వెళ్లి చేసుకో అంతేకాని దళితుల జోలికి వస్తే మాత్రం సహించేది లేదని హెచ్చరించారు.